క్లుప్తంగా

గ్రామాల్లో నీటి సమస్య లేకుండా చూడాలి



పైపులైన్ పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

కోటపల్లి: గ్రామపంచాయతీల్లో నీటి సమస్య లేకుండా చూడాలని డీఎల్‌పీవో ధర్మరాణి కార్యదర్శులను ఆదేశించారు. నక్కలపల్లి గ్రామపంచాయతీని గురువారం సందర్శించి గ్రామాల్లో నీటి సమస్యపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ పైపు లైన్ లీకేజీలు లేకుండా చూడాలని, నీటి లీకేజీ నివారణ పనులు పర్యవేక్షించారు. నీటి సమస్యలు లేకుండా ముందస్తుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని డీఎల్‌పీవో ధర్మరాణి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో భూమన్న, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బద్రీ, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వేమనపల్లి: మండల కేంద్రంలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ దీక్షిత్ తెలిపారు. వ్యవసాయ విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గ్రామాల్లో బీజేపీ ప్రచారం



ప్రచారంలో రఘునాథ్, నాయకులు

దండేపల్లి: మండలంలోని చింతపల్లి, మేదరిపేట గ్రామాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కేంద్రప్రభుత్వ పథకాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంచారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దివ్య, లక్ష్మణ్, ప్రభాకర్, గురువయ్య, సురేందర్, వెంకటేష్, అశోక్, మహేష్, సత్యం, కిషన్, రాకేష్, రవీందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ రవీందర్

చెన్నూర్‌రూరల్: యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ సూచించారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థానాలను అధిరోహించాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లికార్జున్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలి



చలివేంద్రంలో మజ్జిగ, పెరుగన్నం పంపిణీ ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ పరిధిలో పలువురు దాతలు స్పందించి చలివేంద్రాలను నెలకొల్పితే, వారికి మున్సిపల్ పరంగా అండగా ఉండి తాగునీటిని సరఫరా చేస్తామని, మంచిర్యాలకు వచ్చే ప్రజల దాహాన్ని తీర్చాలని మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అన్నారు. మంచిర్యాల మహిళా తరంగిణి(మమత) ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బెల్లంపల్లి చౌరస్తాలో గురువారం ఏర్పాటు చేసిన చలివేంద్రంను మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ప్రారంభోత్సవం సందర్భంగా పెరుగన్నం, మజ్జిగను పంపిణీ చేశారు. గత పదేళ్లుగా చలివేంద్రాన్ని మమత సభ్యులు మహిళలై ఉండి ఏటా ఏర్పాటు చేసి, ప్రజలకు చల్లని తాగునీటిని అందించడంపై మున్సిపల్ చైర్మన్ హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మమత అధ్యక్షురాలు మంజుల కృష్ణారావు, కార్యదర్శి ఇరుకుల్ల లత, కోశాధికారి వందనపు నాగమణి, మమత సభ్యులు జ్యోత్స్న చంద్రదత్, గోపగారి శ్రీదేవి, ఆర్. భాగ్యలక్ష్మీ, పద్మ, ఎం. శృతి, సముద్రాల రమ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యత చాటారు..!

- దాతల సహకారంతో శివాలయ నిర్మాణం
- నేటి నుంచి దేవతా విగ్రహ ప్రాణప్రతిష్ఠా మహోత్సవాలు



శివపంచాయతన క్షేత్రం

మంచిర్యాలఅర్బన్: స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తా రోడ్‌నంబర్–1లో నూతనంగా నిర్మించిన శివపంచాయతన క్షేత్రం ముస్తాబైంది. మూడు రోజుల పాటు నిర్వహించే దేవతా విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాల ఏర్పాట్లు పూర్తయ్యాయి. యజ్ఞశాల నిర్మించారు. టెంట్లు, విద్యుత్ లైట్లు అమర్చారు. తాగునీటి సౌకర్యం కల్పించారు. స్థానికులు విభేదాలను పక్కన బెట్టి, దేవుడి కోసం అందరూ ఏకమై ఆధ్యాత్మికతను చాటి చెప్పారు. దాతల సహకారంతో ధన, వస్తురూపేణా విరాళాలను సేకరించారు. రూ. 500 నుంచి రూ. 2లక్షల వరకు చొప్పున పోగు చేశారు. స్టీలు, కంకర, సిమెంట్, ఇతర వస్తువులను సమకూర్చి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేశారు.

విగ్రహాల ప్రాణప్రతిష్ఠ ఇలా..

రాళ్లపేట్ రోడ్ నంబర్–1లో మూడు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. జగద్గురు పుష్పగిరి పీఠాధిపతులు విద్యా శంకర భారతీస్వామి దివ్యాశీస్సులతో ధర్మపురికి చెందిన మధుశంకర శర్మ, లక్సెట్టిపేటకు చెందిన భరద్వాజ, మంచిర్యాలకు చెందిన రాంభట్ల శశాంక్ వేదపండితుల పర్యవేక్షణలో దేవతా విగ్రహ ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నారు. శివపంచాయతన సహిత అభయాంజనేయ, సరస్వతీ, సుబ్రహ్మణ్య స్వామి దేవాలయంలో శివుడు, గణపతి, పార్వతి, నాగేంద్రుడు, సూర్యనారాయణ, సుబ్రహ్మణ్యస్వామి, సరస్వతీ, ఆంజనేయస్వామి, నవగ్రహ, ధ్వజస్తంభం ప్రతిష్ఠింపజేస్తారు.

మూడు రోజుల పాటు..

ఈ నెల 19న కలశపూజ, గణపతి పూజ, యజ్ఞశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ స్థాపిత దేవత హవనములు, మూలమంత్ర జపములు, జలాధివాసం, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలుంటాయి. 20న శాంతి పాఠం, స్థాపిత దేవతా ఆరాధనం, నవగ్రహ హవనములు, దేవతా హోమములు, జప అనుష్ఠానములు, రుద్రహవనం, పంచసూక్త హవనములు, ధాన్యాధివాసము, పుష్పాధివాసము, ఫలాధివాసము, శయ్యాధివాసము, హారతి, మంత్రపుష్పం, 21న యంత్రస్థాపన, విగ్రహప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, కళావ్యాసం, ప్రాణప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి.

విగ్రహాల ఊరేగింపు..

స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తా సమీపంలోని రాళ్లపేట్ రోడ్ నంబర్–1లో నూతనంగా నిర్మించి ఆలయ మహోత్సవంలో భాగంగా దేవతా విగ్రహాలకు బుధవారం రాత్రి ఘనంగా ఊరేగించారు. బెల్లంపల్లి చౌరస్తా నుంచి ఆలయం వరకు దేవతా విగ్రహాలను భాజా భజంత్రీల మధ్య భక్తులు మంగళారతులు పట్టారు. శివ, రామా నామ స్మరణాలతో మారుమ్రోగాయి.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జిల్లా రేంజ్ ప్లాంటేషన్ అధికారి

కోటపల్లి: అటవీ ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాల నివారణకు అందరూ బాధ్యతగా తీసుకోవాలని మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ సురేశ్‌కుమార్ అన్నారు. సర్వాయిపేట గ్రామంలో అటవీ ప్రాంతంలో అగ్ని ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. ప్లాంటేషన్ ప్రాంతాల మీదుగా వెళ్లేటప్పుడు బీడీలు, సిగరేట్లు తాగి పడేయొద్దన్నారు. అటవీ ప్రాంతంలో కొందరి నిర్లక్ష్యం వల్ల అగ్నిప్రమాదం సంభవిస్తే అటవీ అధికారులకు సమాచారం ఇచ్చి మంటలు ఆర్పేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, వాచర్ ఓదెలు పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని గురువారం స్థానిక ఫైర్‌స్టేషన్ అధికారి దేవేందర్ జిల్లా కేంద్రంలోని పెట్రోల్ బంకులు, గ్యాస్ గోదాముల నిర్వాహకులకు, సిబ్బందికి అగ్ని ప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కల్పించారు. వేసవి కాలంలో ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉన్నందునా, ప్రమాదాల నివారణపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో లీడ్ ఫైర్‌మెన్ భీమయ్య, మల్లయ్య, నరేశ్, రాజేందర్, రవి, గఫార్, మహేందర్, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం సందర్శన



మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మందమర్రిరూరల్: మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే మహిళా సాధికారత సాధ్యమని జిల్లా విద్యాధికారి యాదయ్య పిలుపునిచ్చారు. పట్టణంలోని శ్రీపతినగర్‌లో జిల్లా వయోజన విద్యాశాఖ, లయన్స్ క్లబ్ సఖీ మంచిర్యాల వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వయోజన విద్య, కుట్టు శిక్షణ కేంద్రాన్ని గురువారం సందర్శించారు. వయోజనులను వారి చదువు వివరాలు, కుట్టు మిషన్ నేర్చుకున్న మహిళలను ఎక్కడి వరకు నేర్చుకున్నారో అడిగి తెలుసుకున్నారు. చదువు నేర్చుకుని ప్రయోజకులు కావాలని ఆకాంక్షించారు. ఆయన వెంట జిల్లా వయోజన విద్యాశాఖ అధికారి పురుషోత్తంనాయక్, డీఆర్‌పీ శాంకరి, శిక్షణ కేంద్రం కో ఆర్డినేటర్ గోపిక ఉన్నారు. అనంతరం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో జరుగుతున్న 9వ తరగతి విద్యార్థుల సమ్మేటివ్ అస్సెస్‌మెంట్–2 పరీక్షలను స్కూల్ ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డితో కలిసి పర్యవేక్షించారు.

బీజేపీలో చేరితే దేశసేవ చేసినట్లే

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్



మాట్లాడుతున్న పాయల్ శంకర్

జన్నారం: బీజేపీలో చేరిన ప్రతీ కార్యకర్త, బార్డర్‌లో చేరి దేశానికి సేవ చేసినట్లే అనుభూతి వస్తుందని, అధిక సంఖ్యలో యువకులు, కార్యకర్తలు బీజేపీలో చేరి మరోసారి నరేంద్రమోడీని ప్రధానమంత్రి చేద్దామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే, ఆదిలాబాద్ బీజేపీ అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమలు కాని హామీలతో తెలంగాణతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, హామీలు నెరవేర్చేందుకు అపసోపాలు పడుతుందని ఆరోపించారు. ఉచిత బస్సు ప్రయాణం తప్పా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏమీ చేయలేని పరిస్థితిలో పడిందన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ అవినీతి ఊబిలో ఇరుక్కుపోయిందన్నారు. ఒక్కొక్కటిగా అవినీతి బయట పడుతోందని ఆరోపించారు. ఇలాంటి అవినీతి పార్టీని దరిదాపుల్లోకి రానియ్యొద్దని కోరారు. మంత్రిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎలాంటి ఆరోపణలు లేని వ్యక్తి ఆదిలాబాద్ పార్లమెంట్ అభ్యర్థి గెడం నగేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు, పార్లమెంటరీ కోకన్వీనర్ అశోక్, ఎంపీటీసీ శంకరయ్య, బీజేపీ మాజీ అధ్యక్షుడు చందు, బీజేవైఎం అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు తిరుపతి, నాయకులు రమేశ్, సూర్యం, జలపతి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచాలి



వినతిపత్రం ఇస్తున్న సంఘ సభ్యులు

మంచిర్యాలఅర్బన్: ప్రైవేట్ విద్యాసంస్థల్లో బస్సులపై పనిచేస్తున్న డ్రైవర్లు, క్లీనర్ల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రైవేట్ విద్యాసంస్థల బస్సు డ్రైవర్ల క్లీనర్ల సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. విద్యాసంస్థల్లో పనిచేస్తున్న డ్రైవర్లు, క్లీనర్లు, అటెండర్ల పిల్లలకు ఉచిత విద్య అందించాలన్నారు. సంఘం అధ్యక్షుడు జైపాల్‌సింగ్, కార్యదర్శి శేఖర్, సభ్యులు సురేష్, మహేష్, సంతోష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేర్చుకుంటున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వివేక్

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని 32వ వార్డుకు చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు 40 మందికి పైగా గురువారం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ నాయకులు చిట్ల సత్యనారాయణ సమక్షంలో వార్డుకు చెందిన అయిల్ల విజయ్‌తో పాటు ఆ యన అనుచరులు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు.

జైపూర్: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా రామావుపేట, మద్దులపల్లి గ్రామంతో పాటు పలు గ్రామాల నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపే లక్ష్యంగా పని చేయనున్నట్లుగా తెలిపారు. ఇందులో మాజీ ప్రజాప్రతినిధులు నామాల తిరుపతి, ముదాం రమేశ్, జైపాల్ గౌడ్, నాయకులు బొద్దున రాజన్న, నామాల నాగరాజు, ఆసంపల్లి శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

అంబులెన్స్, వైకుంఠ రథాలకు రాయితీ కల్పించాలి



ఆర్టీవోకు వినతిపత్రం ఇస్తున్న సొసైటీ సభ్యులు

మంచిర్యాలటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నడుపుతున్న బ్లడ్ కలెక్షన్ అంబులెన్స్, వైకుంఠ రథం వాహనాలకు ప్రభుత్వపరంగా రోడ్డు రవాణ సంస్థ ఆధ్వర్యంలో లభించే రాయితీలను కల్పించేలా చూడాలని రెడ్‌క్రాస్ సభ్యులు గురువారం ఆర్టీవో సంతోశ్‌కు వినతిపత్రం అందించారు. తలసేమియా, సికిల్‌సెల్ వ్యాధిగ్రస్తులకు పెద్ద మొత్తంలో రక్తం అందించేందుకు అవసరమైన రక్తదాన శిబిరాన్ని నిర్వహించేలా చూడాలని సభ్యులు వి. మధుసూదన్ రెడ్డి, సత్యపాల్ రెడ్డిలు కోరారు.

గోదావరిఖనికి బస్సులు నడిపించాలి

చెన్నూర్: చెన్నూర్ నుంచి గోదావరిఖనికి ఆర్టీసీ బస్సులు నడిపించాలని పట్టణానికి చెందిన పలువురు యువకులు మధు, సంతోశ్, రఘు, నగేశ్, చిరంజీవిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెన్నూర్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి వివిధ ప్రాంతాలకు నేరుగా బస్సు సౌకర్యం ఉన్నప్పటికీ, చెన్నూర్ నుంచి గోదావరిఖనికి డైరెక్ట్ బస్సు సౌకర్యం లేకపోవడంతో సీసీసీ కార్నర్ నుంచి వ్యయప్రయాసలు పడుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. మంచిర్యాల డిపో మేనేజర్ చెన్నూర్ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని చెన్నూర్ నుంచి గోదావరిఖనికి ప్రతీ రోజు పది ట్రిప్పుల చొప్పున బస్సు నడిపించాలని కోరారు.

విద్యుత్ శాఖ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సభ్యులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందికి రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ప్రథమ చికిత్స, కార్డియో పల్మోనరీ రిససిటేషన్(సిపిఆర్)పై జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ కాలనీలోని విద్యుత్ శాఖ ఎస్ఈ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ ఎస్ఈ శేషారావు మాట్లాడుతూ.. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై ట్రైనర్ వెంకటేశ్ ఇస్తున్న అవగాహన కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. గుండె జబ్బులు వయస్సుతో సంబంధం లేకుండా వస్తున్నాయని, వారికి ఆపదలో ప్రథమ చికిత్సను అందించి, సమీపంలోని ఆసుపత్రికి చేర్పించే బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. విద్యుత్ షాక్‌కు గురైనప్పుడు, పాముకాటుకు గాని, రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి ప్రథమ చికిత్సను అందించేందుకు బ్యాండెడ్ ద్వారా కుట్లు వేసే పద్ధతిని వివరించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈలు ఖైసర్, రాజన్న, పెద్ది రాజం, ఎస్ఏవో శ్రీనివాస్, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కంకణాల భాస్కర్ రెడ్డి, కమిటీ సభ్యులు కాసర్ల శ్రీనివాస్, చుంచు శంకర్ వర్మ పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ రొడ్డ లక్ష్మి

కాసిపేట: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఐదుగురు ఎంపీటీసీ సభ్యులు, ఐదు శాఖలకు చెందిన సిబ్బంది మాత్రమే హాజరుకావడంతో నామమాత్రంగా జరిగింది. సంబంధిత శాఖల అధికారులు తమ నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రొడ్డ లక్ష్మీ మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణసింగ్, మండల వైద్యాధికారి రవికిరణ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, ఏఈఓ రమ్య, ఏపీఓ నవీన్‌కుమార్, ఎంపీఓ నాగరాజు, హెచ్ఈఓ చంద్రశేఖర్, ఎంపీటీసీలు లక్ష్మి, రాంచందర్, చంద్రమౌళి, పద్మ, కో ఆప్షన్ సభ్యుడు సిరాజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగుల అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న రైల్వే ఉద్యోగులు

మంచిర్యాలక్రైం: శ్రీరామ నవమిని పురస్కరించుకొని గురువారం స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలోని కోదండ రామాలయంలో రైల్వే ఉద్యోగులు మెగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక రైల్వేస్టేషన్ అధికారులు సిబ్బంది, ఉద్యోగులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

తాండూర్: తాండూర్ గ్రామంలోని కొత్తగుడిసెలు ప్రాంతంలో ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొని విద్యుత్ స్తంభం విరిగిపోవడంతో కరెంట్ సరఫరాలో సమస్య తలెత్తింది. విద్యుత్ కోత కారణంగా ఆ కాలనీ వాసులకు తాగునీటి సరఫరా కూడా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న ఎంపీడీవో శ్రీనివాస్ గురువారం ఉదయం విద్యుత్ అధికారులతో మాట్లాడి విద్యుత్ మరమ్మతుల పనులను త్వరితగతిన పూర్తి చేయించారు. గ్రామ పంచాయతీ ట్యాంకర్ ద్వారా ఆ కాలనీవాసులకు మంచినీరు సరఫరా చేయించారు. ఎంపీడీవో వెంట గ్రామ పంచాయతీ కార్యదర్శి తపస్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఉండేలా చూడాలి

- నోటీసు బోర్డుపై ఫారం–1 ప్రదర్శించిన అధికారులు



భీమారం: సమస్యలు తెలుసుకుంటున్న చంద్రకళ



ఫామ్1 నోటీసు ప్రదర్శిస్తున్న ఆర్డీవో రాములు

కోటపల్లి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఉండేలా చూసుకోవాలని ఎంపీడీవో భూమన్న అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నోటిఫికేషన్ ప్రతిని ఎంపీడీవో ఆకుల భూమయ్య ఆధ్వర్యంలో ప్రదర్శించారు. ప్రతి గ్రామపంచాయతీ నోటీస్ బోర్డులో పెట్టాలని కార్యదర్శులకు సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సదుపాయాలను సమకూర్చుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ లక్ష్మయ్య, ఏపీవో బాలయ్య పాల్గొన్నారు.

మంచిర్యాలటౌన్: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన నాలుగో విడత గెజిట్ నోటిఫికేషన్‌ను ఎన్నికల సంఘం గురువారం విడుదల చేయగా, అందుకు సంబంధించిన ఫామ్ 1 నోటీసును మంచిర్యాల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాములు తన కార్యాలయంలో నోటీసు బోర్డులో ప్రదర్శించారు.

చెన్నూర్: తహసీల్ కార్యాలయం నోటీసు బోర్డుపై పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ఫారం–1ను అందుబాటులో ఉంచినట్లు ఏఆర్వో చంద్రకళ తెలిపారు. గురువారం నుంచి పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. అభ్యర్థులు నామినేషన్లు ధాఖలు చేసేందుకు అవసరమైన ఫాం–1ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. డీటీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పోలింగ్‌స్టేషన్ పరిశీలన

భీమారం: పెద్దపల్లి పార్లమెంట్ పరిధి చెన్నూర్ నియోజకవర్గంలోని ప్రతీ పోలింగ్‌స్టేషన్‌లో మౌలిక సదుపాయలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెన్నూర్ నియోజకవర్గ అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి చంద్రకళ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌కేంద్రాన్ని గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం సదుపాయల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్‌స్టేషన్లలో మంచినీటితో పాటు మరుగుదొడ్ల సదుపాయం ఉండేలా చూస్తున్నామని తెలిపారు. పోలింగ్ సిబ్బంది రాత్రి సమయంలో పోలింగ్‌స్టేషన్‌లోనే బసచేస్తారని, ఇందుకోసం విద్యుత్ సరఫరా ఏర్పాటు చేసేందుకు ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఓటర్లు నిర్భయంగా వచ్చి ఓట్లు వేసేందుకు, అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ప్రతిని అందరికీ కనిపించేలా ఏర్పాటు చేశారు. గ్రామపంచాయతీల్లో కూడా ఏర్పాటు చేయాలని ఆమె ఆదేశించారు. ఇందులో ఎంపీడీవో రాదరాథోడ్, తహసీల్దార్ సదానందం, ఎంపీవో సతీష్‌రెడ్డి ఉన్నారు.

పురవీధుల్లో గరుడ సేవ

చెన్నూర్: పట్టణంలోని జగన్నాథాలయం నుంచి పురవీధుల్లో ఆలయ ప్రధాన అర్చకులు దామెర మోహనాచార్యుల ఆధ్వర్యంలో గరడ సేవ కనుల పండువగా సాగింది. శ్రీరామ నవమిని పురస్కరించుకొని మరునాడు ప్రతి ఏటా గరుడ సేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని అర్చకులు తెలిపారు. గరుడసేవకు అడుగడుగునా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో అర్చకులు దామెర అనిలాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

- ఎర్రటెండలో పిన్నారం నుంచి కొండగట్టుకు పాదయాత్ర
- దారిపొడవునా గ్రామాల్లో స్వాగతం



పిన్నారం నుంచి కొండగట్టుకు పాదయాత్ర చేస్తున్న దీక్షాపరులు

కోటపల్లి: పల్లెల్లో ఆధ్యాత్మిక వెల్లివిరుస్తోంది. రామ నామం మార్మోగుతోంది. ఎర్రని ఎండ, వేడి గాలులు ఇవేమి తమ భక్తికి అడ్డుకాదని హనుమాన్ భక్తులు అంటున్నారు. కోటపల్లి మండలం పిన్నా రం గ్రామానికి చెందిన 15మంది హనుమాన్ భక్తులు కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. కొండగట్టు చేరుకునే సరికి ఐదురోజుల సమయం పడుతుందని వారు పేర్కొంటున్నారు. దారివెంట గ్రామాల్లోని హనుమాన్ ఆలయాల్లో బస చేస్తామ ని, ఆయా గ్రామాల ప్రజలు స్వాగతం పలుకుతున్నారని వారు చెప్పారు. పాదయాత్రలో గురుస్వామి సత్యం, మాలదారులు గడ్డం మారయ్య, రాజలింగు, సమ్మన్న, తిరుపతి తదితరులు ఉన్నారు.